# నానీ... ఆ రాస్కెలు

**— ఎం. హేమలత**

**ఆనందంగా ఈల వేసుకుంటూ బజ్జర్ నొక్కిన రమేష్‌కి డోర్ తెరచుకోవడానికి కొంత టైము పట్టడం ఆశ్చర్యం కలిగించింది. కారు రివర్స్ చెప్పడుకే పరుగు పరుగున వచ్చి తలుపు చెంత తచ్చాడే మూడేళ్ళ ముద్దుల కుమారుడు అనూప్ జాడ కనించలేదు. తలుపు తెరిచిన భార్య సునంద అత్యావసరమైన పనేదో వున్నట్టు అంతర్ధానమవడం రమేష్ దృష్టిని దాటిపోలేదు.**

బ్రీఫ్‌కేసుని టీపాయ్ మీదికి గిరాటు వేసి, చుట్టూ చూసాడు రమేష్. ఇల్లంతా ప్రశాంతంగా, నిశ్శబ్దంగా వుంది. సోఫాలో కూచుని టి.వి.ని చూస్తూనో, పేపరు తిరగేస్తూనో కన్పించే తండ్రి రామారావు జాడ లేదు. సరికదా "నాయనా రమేష్! ఈ రోజైనా ఉసిరికాయలు మర్చిపోకుండా పట్టుకొచ్చావా పచ్చడికి, మళ్ళీ సీజన్ అయిపోతుంది" అంటూ వెంటబడే తల్లి సరస్వతమ్మ కూడా కన్పించలేదు.

'ఏమయ్యారబ్బా మాతాపితలు? ఒక వేళ మనవణ్ణి వెంటబెట్టుకుని ఏ చుట్టాలింటికో వెళ్ళలేదు కదా...' అన్న సందేహం జనియించి, వెంటనే 'ఆహా! ఏమి నా భాగ్యం. ఈ సాయం సంధ్యా సమయాన నా సహధర్మచారిణితో ఏకాంతవాసం...' అనుకొని మహదానందపడబోయిన రమేష్, బెడ్ రూములో నుండి సరస్వతమ్మ దగ్గు వినిపించడంతో నీరసపడిపోయాడు.

బూట్లు విప్పి, పాదాలను ఉపశమనం కోసమా అన్నట్లు ఫ్రైస్ చేసి సోఫాలో సోలిపోతున్న రమేష్‌ను సమీపించింది సునంద – టీ కప్పుతో.

"ఏంటోయ్! అమ్మ ఈ టైములో పడుకున్నారు. పైగా దగ్గుతున్నారు..." అంటూ సునంద చేతిలోని కప్పు అందుకోబోయి ఆగిపోయాడు.

"సునందా! ఏంటీ రోజూ అన్నీ కొత్తగా వున్నాయ్? నేనెప్పుడైనా టీ ఈ కప్పులో తాగానా? రోజూ తాగే కప్పే మయింది"

"అబ్బ! ఏ కప్పులో తాగితే ఏమయిం దండీ..." అంటూ కప్పుని టీపాయ్ మీద పెట్టింది సునంద.

"నా ప్రశ్నకి అది సమాధానం కాద నుకుంటాను..." కొంచెం విసుగ్గా భార్య కేసి చూశాడు రమేష్.

నిస్సహాయంగా చూస్తున్న కోడల్ని ఆదుకోవడానికే అన్నట్లు సరస్వతమ్మ రంగప్రవేశం చేసింది.

"నీదంతా మరీ చోద్యంరా!... టీ – ముఖ్యం కానీ, అది పోసిన కప్పుదే ముంది..." కోడల్ని వెనకేసుకొచ్చింది సరస్వతమ్మ.

"అసలు నాకు తెలీకడుగుతాను. నా కప్పు ఏమయిందంటే జవాబు చెప్పరేం...?" మళ్ళీ రెట్టించాడు రమేష్. సునంద తటపటాయించడం చూసి సరస్వతమ్మ అంది, "రమేష్! కప్పు అన్నాక పగలకుండా వుంటుందా నాయనా!"

"ఏమిటి! నా కప్పు పగిలిపోయిందా...?" ఇంతెత్తున ఎగిరిపడ్డాడు రమేష్.

"ఏవిట్రా మహా! అసెంబ్లీ భవనం మీద బాంబు పడ్డట్టు అంత ఇదవతా వేంటి?"

"అమ్మా! అసెంబ్లీ బిల్డింగ్ సంగతి నా కనవసరం. ఆ కప్పులో తప్ప నేను టీ తాగనని సునందకి బాగా తెలుసు. అటువంటిది...."

"ఔన్రా! నాకు తెలుసు. సునందకి తెలుసు. తెలీందల్లా నాని గాడికే. నాని గాడు ఎత్తేసాడు. అది పగిలిపోయింది. ఇప్పుడేం చేస్తాం చెప్పు"

అత్తగారి ధైర్యాన్ని అభినందించకుండా (మనస్సులోనే) వుండలేకపోయింది సునంద. 'అమ్మయ్య! ఓ గండం గడిచింది' అని సంతోషపడిపోయింది.

"ఆహా! ఇది నానిగాడి పనా! ఏడి ఆ వెధవ? అయినా ఈ వెధవల అల్లరి మరీ ఎక్కువైపోయింది...." అంటూ ఏ కళమన్నాడో, కప్పనందుకొని టీ చప్పరించడం మొదలుపెట్టాడు రమేష్.

స్నానం చేసి గదిలోకి వస్తున్న రమేష్‌కి వాయవ్య మూల నున్న కార్నర్ టేబిల్ ఖాళీగా వుండడం ఆశ్చర్యాన్ని కలిగించింది. పాలరాతి బుద్ధ విగ్రహం ఆ టేబిల్ మీద వుండాలి. ఏమయింది...? "సునందా!" అంటూ ఈ తడవ కొంత పెద్దగానే పిలచాడు. కాదు, కాదు – అరిచాడు రమేష్. ఇప్పుడో– ఇంకాస్సేపటికో పిడుగు పడబోతోందని గ్రహించిన సునంద రానున్న ఆపదని ముందుగానే ఊహించినదై తన రక్షణ కవచం ఆయిన అత్తగార్ని వెంటపెట్టుకుని మరీ అడుగిడింది 'యుద్ధ' రంగంలోకి – అదే భర్త వున్న బెడ్‌రూములోకి.

ఈలోగా దువ్వెన కోసరం అలమరా తెరిచిన రమేష్‌కి ప్రొద్దుటే తను అసంపూర్తిగా పెయింట్ చేసి వదిలేసిన చిత్రపటం పూర్తిగా పంచరంగులు పులుముకొని సరికొత్త ఆధునిక చిత్రంలా సాక్షాత్కరించింది. చేతిలో పెయింటింగ్ పట్టుకొని ఇటు తిరిగిన రమేష్ ఈమారు ఉగ్ర నరసింహుడే అయ్యాడు.

"ఆదీ! ఆదీ!!" అంటూ నసుగుతున్న సునందని 'నువ్వూరుకో' అన్నట్లు సైగ చేసి, "ఏం లేదురా రమేష్! నానిగాడు..." అంటూ ఏదో చెప్పబోయింది సరస్వతమ్మ.

"నానిగాడు... నానిగాడు... అన్నిటికీ నానిగాడు. ఇంతకీ ఎక్కడ వాడు...?" రంకె పెట్టాడు రమేష్.

అత్తా కోడళ్ళు వూరుకుండడం చూసి. "ఎంతసేపూ నానిగాడు నానిగాడు అంటూ మూడేళ్ళ ఆ పసివాడి మీద నేరాలు పెట్టకపోతే ముప్ఫై ఏళ్ళొచ్చిన నువ్వేమయ్యావ్? కప్పు పగలగొట్టడం ఆ వెధవ పనే. బంగారం లాంటి బుద్ధ విగ్రహం బుగ్గి కావడం కూడా వాడి చలవే. మరి అలమారాలో వున్న ఈ పెయింటింగ్‌ని కూడా రక్షించలేకపోయారా పెద్దవాళ్ళు మీ రిద్దరుండి...?" అక్షింతల వర్షం కురిపించాడు రమేష్.

"అది కాదండీ...! మామయ్య గారు..."

"ఆ... నాన్నగారు! నాన్నగారే చెప్పారా

ఇవన్నీ నాశనం చెయ్యమని?"

"అలా అని ఆయన మాత్రం ఎందుకు చెప్తార్రా. కప్ప చేతిలోకి తీసుకోగానే బలవంతంగా లాక్కోబోయిన సునందని వారిస్తూ, వాడికి ఏది కింద పడేస్తే పగులుతుందో, ఏది పగలదో మీ నాన్నగారు సోదాహరణగా వివరిస్తూ వుండగానే వాడు తన చేతిలోని కప్పను నేలకేసి కొట్టి 'ఇది పగిలేదే తాతగారూ...!' అంటూ నిరూపించాడురా" అంది సరస్వతమ్మ నవ్వును పెదిమల వెనుక దాచుకుంటూ. తను నవ్వితే కొడుక్కి కోపం వస్తుందేమోనన్న భయం ఆమెది.

"ఒ...కే... మరి బుద్ధ విగ్రహం?"

"ఇది పగలదేమో అనుకున్నాను నాన్నమ్మా! కానీ ఇది కూడా పగిలేదే అన్నాడు అది కాస్త కింద ఎత్తేసి..." అంది సరస్వతమ్మ.



"వాడు విలువైన వస్తువునలా పాడు చేస్తుంటే మీరంతా చోద్యం చూస్తూ నిల్చున్నారన్నమాట!" అన్నాడు కోపంగా రమేష్.

"పిల్లలకి ఇది చేయకూడదు అని చెప్పరాదట. వాళ్ళని అనలే కొట్టరాదట. మొన్న బుక్ ఎగ్జిబిషన్‌లో కొని తెచ్చిన కొత్త పుస్తకం – అదే – పిల్లల పెంపకాన్ని గురించిన పుస్తకం చదువుతున్నారుగా మామగారు" అంది సునంద కొంచెం ధైర్యం తెచ్చుకొని.

"ఓహో! ఈ మధ్య రోజూ ఔపాసన పడుతున్నారు. 'చైల్డ్ డెవలప్‌మెంట్ – ఎ రిసర్చ్ ప్రాజెక్ట్' ఆ పుస్తకమేనా? ఇంకా ఆ పుస్తకంలో వున్న అమూల్య సందేశాలేంటో...?" వెటకారంగా అన్నాడు రమేష్.

"వ్యతిరేకార్థక భావాలు కలుగచేసే విధంగా పిల్లల్తో ప్రవర్తించరాదట. ఏదైనా చేయి అంటే చేస్తారట. చేయొద్దు అంటే ఏం... ఎందుకు... చేస్తే ఏమౌతుంది అన్న అనవసర కుతూహలం వాళ్ళల్లో రెకెత్తి ఆ పనిచేసే దాకా వూరుకోరట. ఏదో పాజిటివ్ ఇజమ్ అట కదా– అదే సరైన పద్ధతి అట. అత్యధిక తెలివితేటలు గల పిల్లలే అల్లరెక్కువ చేస్తారట. మరో విషయం – పిల్లలు పెద్దవాళ్ళని అనుకరిస్తుంటే పెద్దలు హర్షించి వాళ్ళని ప్రోత్సహించాలట. నీలాగా పెయింటింగ్ వేస్తున్నాడంటూ మీ నాన్నగారు – ఎంత మురిసిపోయారో.... పదిహేను రోజులుగా కష్టపడి వేస్తున్న చిత్రపటంపై రంగులెలా పులిమి పాడుచేశాడో చూడండి అని నేనంటే – పోనీలేవే – పోయిందల్లా కాసింత కాన్వాసు గుడ్డా, రెండు మూడు రంగుల ట్యూబులేగా అంటూ నాని గాడ్ని వెనకేసుకొచ్చారు..." కొడుకును స్వాంతనపరుస్తూ అంది సరస్వతమ్మ.

"అమ్మా! ఇంతకీ ఆ అల్లరి వెధవ ఏడీ? నాలుగు తగిలిస్తే కాని బుద్ధి రాదు".

"నువ్వలా కోప్పడి కొడ్తావేమోనని భయపడే వాణ్ణి తీసుకుని బజారుకెళ్ళార్రా మీ నాన్న" చల్లగా కబురందించింది సరస్వతమ్మ.

"కోప్పడకుండా ముద్దెట్టుకోవాలా, రానీ ఆ రాస్కెల్‌ని. నాన్నగారు కొని తెచ్చిన ఆ మాయదారి పుస్తకం వల్ల వచ్చిపడ్డాయ్ ఈ తిప్పలన్నీ. సునందా! ఆ పుస్తకం పట్టుకురా. ముందు దాన్ని చింపి పోగులు పెడ్తే కానీ నాకు శాంతి వుండదు."

రమేష్ మాటలకి ఎంత ఆపుకుందామన్నా నవ్వాగలేదు సునందా – సరస్వతమ్మలకి. అత్తాకోడళ్ళు నవ్వుతుంటే, ఇంకా చిర్రెత్తుకొచ్చింది.

"ఇప్పుడు తాతా మనవడు బజారుకెళ్ళింది ఎందుకనుకున్నావ్? నీ పుత్రరత్నం చింపి పోగులు పెట్టిన ఆ అపురూప పుస్తకాన్ని వీలైతే బైండ్ చేయించడానికి నీ కోపతాపాలని తాత్కాలికంగా తప్పించడానికి కూడా అనుకో. అల్లరి చేసాడని కొడుకునైతే తండ్రిగా దండించగలవు కానీ, ఆ అల్లరే ఐ.క్యూ. అంటూ మురిసిపోతూ వాణ్ణి ఎంకరేజ్ చేసిన మీ తండ్రినేమనగలవురా....?" గది లోంచి వెళ్ళిపోతూ అంది సర్వసతమ్మ.

అమ్మ మాటలను తలపోస్తూ, మంచం మీదికి వాలిపోయాడు. తాతా మనవల అఘాయిత్యానికి బలైన అభాగ్యజీవి రమేష్.